సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం ı 5 ı ఫిబ్రవరి ı 2024



తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం
రైతులకు యూరోపియన్ కీర దోస సాగు చక్కటి ప్రత్యామ్నాయ పంట. తక్కువ ఖర్చుతో తక్కువ కాలంలో దిగుబడి సాధించడం ఈ పంట ప్రత్యేకత. -8లో



సీఎం నిర్ణయమే శిరోధార్యం
రాజంపేట అభ్యర్థి ఎంపికలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయమే శిరోధార్యమని మేడా సోదరులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, మేడా రఘునాథరెడ్డి వెల్లడించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 125 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	480
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 311.100 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి నేడు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

నియామకం



కటికం సుబ్రమణ్యం

ఓబులవారిపల్లె: సమాచార హక్కు చట్టం, న్యాయ పోరాట సమన్వయ కమిటీ రాయలసీమ జోన్ అధ్యక్షులుగా కటికం సుబ్రమణ్యంను జాతీయ చైర్మన్ కంచర్ల సురేష్ నియమించినట్లు ఆదివారం ప్రకటించారు. మండల కేంద్రంలోని కటికం వారిపల్లెకు చెందిన కటికం సుబ్రమణ్యం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని సుబ్రమణ్యం తెలియజేశారు.

ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతత



శాకాహార శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం: ప్రతి ఒక్కరూ శాకాహారులుగా మారాలని, మాంస కృతులకు దూరంగా ఉండాలని అప్పుడే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా, మనశ్శాంతిగా ఉంటారని సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ తెలిపారు. మండల కేంద్రంలోని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ధ్యాన, జ్ఞాన శిక్షణా కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిద్దవటం దిగువపేట నుంచి ఎగువపేట పురవీధుల్లో మహాకరుణ శాకాహార శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ధ్యాన సాధన చేయడం వల్ల శారీరక, మానసిక అనారోగ్యాలు అంటే తలనొప్పి నుంచి కేన్సర్ వరకు సమస్త వాధ్యులను నివారించుకోవచ్చునన్నారు. మానసిక ప్రశాంతత పెరిగి జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఏనుగుల హల్‌చల్



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి తోట

కలికిరి: చిత్తూరు జిల్లా సోమల మండలం అటవీప్రాంతం నుంచి అన్నమయ్య జిల్లా కలికిరి, వాల్మీకిపురం మండలాల సరిహద్దు ప్రాంతానికి వచ్చిన ఏనుగులు శనివారం రాత్రి అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి వచ్చి హల్‌చల్ సృష్టించాయి. మేకలవారిపల్లికి చెందిన ఓ రైతు వరి పొలం, మరో రైతుకు చెందిన అరటితోటను ధ్వంసం చేశాయి. ఒక టెంకాయ చెట్టును పెకలించాయి. చుట్టు పక్కల ప్రాంతాల రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ఆదివారం ఉదయం తిరిగి సోమల మండల అటవీప్రాంతానికి ఏనుగులు వెళ్లిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

సమాజసేవలో స్కాట్స్, గైడ్స్

కడప స్పోర్ట్స్: సమాజంలో జిల్లా స్కాట్స్, గైడ్స్ చక్కటి సేవలు అందిస్తున్నాయని బద్వేలు ఎంఈఓ, గైడ్ కెప్టెన్ ప్రమీల పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం శంకరాపురంలోని హెజ్‌మాడీ స్కాట్స్, గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి తృతీయ సోపాన్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్కాట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత పెరుగుతాయన్నారు. స్కాట్స్, గైడ్స్‌లో తృతీయ సోపాన్ ఎంతో ముఖ్యమైనదన్నారు. తమిళనాడు నేషనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి విచ్చేసిన కమల్ కన్నన్, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు, జిల్లా శిక్షణ కమిషనర్ విజయ్‌కుమార్‌లు శిక్షణలో భాగంగా స్కాట్స్ కేడెట్స్‌కు పలు అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి.వి. రమణయ్య, శివప్రసాద్, ఖాదర్‌బాషా, బాలసుందరం, వెంకట సుబ్బయ్య, గంగిరెడ్డి, సుబ్బరాయుడు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బిందువు.. రైతు బంధువు



ఇతని పేరు కె.సూర్యనారాయణ.పెద్దతిప్పసముద్రం. ఇతనికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఇచ్చిన డ్రిప్ పరికరాలను అమర్చాడు. వీటి ద్వారా రెండున్నర ఎకరా పొలంలో టమాట, మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగవుతున్నాయి. తక్కువ నీటితో పంటలు సాగు అవడమే కాకుండా విద్యుత్ ఆదా అవుతోందని ఆయన చెబుతున్నాడు.

- సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- సబ్సిడీతో డ్రిప్ పరికరాల అందజేత
- జిల్లాలో 17517 హెక్టార్లలో పంటల సాగు



కె.వి.పల్లె మండల పరిధిలో వేరుశనగ పంటకు స్ప్రింకర్ల ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

రాయచోటి: కరువు ప్రాంతాలలోని రైతులకు సూక్ష్మ సేద్యం కల్పవృక్షంలా మారింది. ఫలితంగా వర్షాభావ పరిస్థితుల్లోనూ ఏటా రైతులు బంగారు పంటలు పండిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో బిందు, తుంపర పరికరాలు అమర్చుకుని కరువును పారదోలారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుని ఖరీఫ్, రబీలో నాణ్యమైన దగుబడి సాధించడంతోపాటు నికర ఆదాయాన్ని పొందుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే విధంగా జగనన్న ప్రభుత్వం సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. అవసరం ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్ల సదుపాయం కల్పిస్తోంది. గతంలో ఉద్యాన పంటలకు మాత్రమే ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేవారు. నేడు టమాట, వంగ, మిరప, వేరుశనగ, ఉల్లి, ఆకుకూర తోటలు, కూరగాయల పంటల్లో సూక్ష్మ సేద్యం వినియోగం గణనీయంగా పెరిగింది. కరువు ప్రాంతంగా పేరొందిన అన్నమయ్య జిల్లాలో నీటి పారుదల సదుపాయం అంతంతమాత్రంగా ఉండటం, వర్షాలు ఆశించిన మేరకు కురవకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి రైతులకు సూక్ష్మ సేద్యం సదుపాయాన్ని కల్పిస్తోంది. రెండేళ్లుగా ప్రత్యేక ప్రాధాన్యతతో పరికరాలను అందజేస్తూ పొలాల్లో అమరుస్తోంది.

90 శాతం సబ్సిడీ..

ఐదెకరాలలోపు రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం సదుపాయాన్ని కల్పిస్తోంది. 5 నుంచి 10 ఎకరాల్లోపు వారికి 70 శాతం సబ్సిడీ లభిస్తోంది. స్ప్రింక్లర్లు అమర్చుకుంటే ఐదెకరాల లోపు రైతులకు 55 శాతం, ఐదు ఎకరాలు పైబడిన వారికి 45 శాతం సబ్సిడీ లభిస్తుంది. గత ఏడాది (2022-23) 9,700 హెక్టర్లకు బిందు సేద్యం కల్పించాలన్నది అధికారుల లక్ష్యం కాగా... 9947 మంది రైతులకు సంబంధించిన 10759.63 హెక్టార్లకు కల్పించారు. ఈ ఏడాది (2023-24) 12000 హెక్టార్ల లక్ష్యాన్ని ఇవ్వగా.. ఇప్పటి వరకు 6283 మందికి చెందిన 6758.25 హెక్టార్లలో బిందు సేద్యం సౌకర్యం కల్పించారు. 2022-23లో రూ.78.34 కోట్ల వరకు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం ఖర్చు చేసింది. 2023-24లో రూ.126 కోట్ల వరకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే సగానికి పైగా సబ్సిడీ రూపంలో పరికారాల కోసం ఖర్చు చేసింది. దీంతో రెండేళ్లలోనే రూ.204 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించనుంది...

స్ప్రింక్లర్లకు పెరిగిన డిమాండ్...

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడి కాలువ ద్వారా గాలివీడు, లక్కిరెడ్డపల్లె, రామాపురం మండలాల్లోని చెరువులను నీటితో నింపేలా రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. అలాగే మహానేత వైఎస్సార్ హయంలో నిర్మించిన శ్రీనివాసపురం, ఝరికోన, నూతికోన, తంబళ్లపల్లె సమీపాలలోని ప్రాజెక్టుల్లోకి నీటి వనరులు అందుబాటులోకి రావడం రైతులకు కలిసి వచ్చింది. దీంతో రబీలో వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడుతో పాటు కూరగాయల పంటలు కూడా అధికంగా సాగు చేస్తున్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, వేరుశనగ ఎక్కువగా సాగు అవుతుండడంతో రైతులు స్ప్రింక్లర్లు, బిందు సేద్యం పరికరాలపై ఆసక్తి చూపుతున్నారు. 2022-23లో 10759.63 హెక్టార్లు, 2023-24లో 6758.25(ఫిబ్రవరి నెల వరకు) హెక్టార్లకు స్ప్రింక్లర్ల సదుపాయం కల్పించారు. తద్వారా 1,05,000 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. రెండేళ్లలో 16,230 మంది రైతులు బిందు, తుంపర సేద్యం ద్వారా 17,517.88 హెక్టార్లలో పంటలను సాగు చేశారు.

రికార్డు స్థాయిలో దిగుబడులు..

సూక్ష్మ సేద్యం సదుపాయంతో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు గణనీయమైన దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది మామిడి, టమాట, అరటి, బొప్పాయి, దానిమ్మ, జామ, సపోట, వేరుశనగ సాగును డ్రిప్ కింద చేపట్టారు. దీనివల్ల తక్కువ నీటితోనే రికార్డు స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. అన్ని పంటల్లోనూ సూక్ష్మ సేద్యంతో దిగుబడులు 30 నుంచి 50 శాతం వరకు పెరిగాయని రైతులు చెబుతున్నారు. పంట ఉత్పత్తులు కూడా నాణ్యతతో ఉండటంతో వాటికి మార్కెట్‌లో ధరలు కూడా అనుకూలంగా ఉన్నాయి. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది...

మంచి ఫలితాలు వస్తున్నాయి



జిల్లాలో సూక్ష్మ సేద్యం సాగులో మంచి ఫలితాలు వస్తున్నాయి. డ్రిప్ కింద టమాట, వంగ, మిర్చి, వేరుశనగ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో పంటల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. తక్కువ నీరు, విద్యుత్ ఆదాతో సాగు విస్తీర్ణం పెరిగి రైతులకు నికరాదాయం వస్తోంది. అవసరం ఉన్న ప్రతి రైతుకూ సబ్సిడీ ద్వారా డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తాం.
-వెంకటేశ్వరరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ, అన్నమయ్య జిల్లా

ఇవీ లాభాలు..

- సూక్ష్మ సేద్యంతో బోర్లు, బావుల్లో తక్కువ నీరు ఉన్నా పంటలు సాగు చేసుకోవచ్చు.
- ఈ విధానంలో చుక్క నీరు కూడా వృథా కాదు.
- విద్యుత్ వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది.
- ఫర్టిగేషన్ ద్వారా మొక్కకు నేరుగా ఎరువులు ఇచ్చే అవకాశం ఉంది.
- నీటి బిందువులు మొక్కల మొదళ్ల దగ్గర మాత్రమే పడుతుండటం వల్ల కలుపు సమస్య ఉండదు.
- తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత

కమలాపురం: వైఎస్ఆర్ జిల్లా కమలాపురం పట్టణానికిచెందిన జోసఫ్ అనే వ్యక్తికి కమలాపురం 1వ వార్డు సచివాలయం వలంటీర్ రమాదేవి తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశారు. జోసఫ్ డయాలసిస్ పేషెంట్. ఇటీవల తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకు న్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ రమాదేవి ఆదివారం తిరుపతికి వెళ్లి జోసఫ్‌కు రూ.10 వేల పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో జోసఫ్ కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రికెట్ పోటీ విజేత సుశాంత్ లెవెన్



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

మైదుకూరు: మైదుకూరు పట్టణంలో 'మైదుకూరు క్రికెట్ క్లబ్', గణేష్ రాయల్స్ ఆధ్వర్యంలో జనవరి 21 నుంచి నిర్వహించిన ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ఎంసీసీ క్రికెట్ ట్రోఫీని ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన సుశాంత్ లెవెన్ జట్టు కైవసం చేసుకుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి 36 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన సువాంత్ ఎలెవెన్ జట్టు, మైదుకూరు డ్రింకర్స్ లెవెన్ జట్టు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రొద్దుటూరు సుశాంత్ లెవెన్ జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు రూ.50,116 మైదుకూరు ఆర్యవైశ్యసభభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ గుప్త అందించగా, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ ఏపీ రవీంద్ర అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన మైదుకూరు డ్రింకర్స్ లెవెన్ జట్టుకు ధనపాల సందీప్ రాయల్ రూ.30,116 అందించారు. మైదుకూరు క్రికెట్ క్లబ్ ప్రతినిధులు, పోటీల నిర్వాహకులు సునీల్, నారాయణ, గోవిందు, గంగులు, రాజా, బాష, జస్వంత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ

పులివెందుల రూరల్: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం అమలు చేసే విషయంలో ప్రభుత్వం, అధికారులు, రైతులు చిత్తశుద్ధితో ఉన్నారని జర్మన్ ప్రభుత్వ ప్రతినిధి బృందం పేర్కొంది. బృందంలోని సభ్యులు ఆదివారం పట్టణంలోని ఏపీ కార్ల్ పశుపరిశోధన కేంద్రంలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించవచ్చని తెలిపారు. వర్షాధార ప్రాంతాల్లో కూడా ఏడాది పొడవునా పంటలు పండించడం వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలగడమేకాక వాతావరణంలో కూడా మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఏపీలో అమలవుతున్న ఆగ్రో ఎకాలజీ కార్యక్రమాలను పరిశీలించి బలోపేతం చేసే ప్రణాళికలను రూపొందించడం కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రిసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ సందర్శించారు. జర్మన్ కంపెనీ సీనియర్ పాలసీ అడ్వైజర్ శ్రీక్రిస్టోఫ్, సీనియర్ పాలసీ ఆఫీసర్ఆలెగ్జాండర్ లింగెంతాల్, కేఎఫ్ డబ్ల్యూ కంట్రీ మేనేజర్ శ్రీజో ష్కాగ్రేవ్, సీనియర్ సెక్టార్ స్పెషలిస్ట్ శ్రీమతి ,సంగీత అగర్వాల్,చేంజ్ అండ్ బయోడైవర్శిటీ విభాగం క్లస్టర్ కోఆర్డినేటర్ మొహమ్మద్.ఎల్-ఖవాద్, న్యాచురల్ రిసోర్స్ మేనేజర్ రాజీవ్ ఆహల్ పాల్గొన్నారు.

- అంతర్జాతీయ ప్రతినిధి బృందం సభ్యులు ఆదివారం అకాడమీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రాంగణం పరిధిలో రూపొందించిన ఏ గ్రేడ్ ఏటీఎం, డీపీఎం, 5 అంతస్తుల నమూనా క్షేత్రాలను సందర్శించారు. రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ సభ్యులకు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు.



ప్రకృతివ్యవసాయ క్షేత్రంలో నమూనాను పరిశీలిస్తున్న జర్మన్ బృందం సభ్యులు

- రైతు శాస్త్రవేత్తలు ప్రతినెలా తమ పొలం ద్వారా ఎకరాకు రూ.50 వేలు సంపాదించాలని రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. రైతు శాస్త్రవేత్తలు రైతులకు దిక్సూచిగా నిలవాలన్నారు. కారక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ జాకీర్,, లీడ్‌లు, సుధాకర్,సురేష్, ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఎంఎల్‌హెచ్‌పీ'ల నియామక కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో సోమవారం కడపలోని ఐఎంఏ హాలులో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నియామకాల కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. రాయలసీమ జిల్లా వ్యాప్తంగా మొత్తం 56 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారి జాబితాను హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. కడప మున్సిపల్ స్టేడియం వద్దగల ఐఎంఏ హాలులో ఉదయం 10 గంటలనుంచి జరిగే కౌన్సెలింగ్‌కు ఎంపికై న అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం ఇప్పటికే అభ్యర్థులకు తెలియజేయడం జరిగిందని ఆమె తెలిపారు.

సాహితీ ధృవతార ఖమర్

- 80 ఏళ్ల వయస్సులోనూ మాతృభాష సేవ
- కవి,రచయితగా ఉర్దూ, హిందీ భాషల్లో రాణింపు



జీవిత సాఫల్య అవార్డును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకుంటున్న ఖమర్‌అమీని

మదనపల్లె సిటీ: రాయలసీమ ఉర్దూ సాహిత్యంలో ఖమర్ అమీని అలియాస్ ఖమర్ హజరత్ అంటే తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. సాహితీ ప్రపంచంలో ధృవతార ఆయన. 80 ఏళ్ల వయస్సులోనూ మాతృభాషలైన ఉర్దూ, జాతీయ భాషలైనా హిందీలకు సేవలందిస్తున్నారు. తన 15వ ఏట నుంచి కవిత్వాలు రాయడం ప్రారంభించిన ఆయన.. 65 ఏళ్లుగా అలుపెరగకుండా రాస్తూనే ఉన్నారు. ఆయన రాసిన ఎన్నో పుస్తకాలు, కవితా సంపుటాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించాయి. మైనార్టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉర్దూ అకాడమీ 2023 ఏడాదికి ఖమర్‌కు జీవిత సాఫల్య అవార్డు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో ఆయన రచనలు గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.

మదనపల్లె పట్టణం దేవళంవీధిలో నివసిస్తున్న ఈయన ఉద్యోగ విరమణ చెందిన ఉపాధ్యాయుడు. అసలు పేరు బాబా ఫక్రుద్దీన్. కలం పేరు ఖమర్ అమీని. 22 ఏళ్ల పాటు ఉర్దూ ఉపాధ్యాయునిగా , 18 ఏళ్లు హిందీ ఉపాధ్యాయునిగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేసి పదవీ విరమణ అనంతరం మదనపల్లెలో స్థిరపడ్డారు. 1954లో మొదట కవిత్వం రాయం ప్రారంభించిన అమీని ఇప్పటి వరకు వేలాది కవిత్వాలు రాశారు. ఇందులో హమ్ద్, నాత్, నజమ్, గజల్, మన్‌ఖబత్‌తో పాటు హిందీలో దోహాలు కూడా రాశారు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, ఢిల్లీ నగరాల్లో దాదాపు 500కుపైగా కవి సమ్మేళనాల్లో పాల్గొని తన కవిత్వాలతో అలరించారు. ఆయన రాసిన 'అమ్మకు ఓ అక్షరం(మా)' అను కవితకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి లభించింది. ఆయన ప్రసిద్ధి చెందిన కడప పెద్ద దర్గాలో 30 సంవత్సరాలు సాహితీ సేవలు అందించారు. ఆయన రచించిన కవితలు ప్రఖ్యాత గాయకులు పంకజ్‌ఉదాస్, విఠల్‌రావు, ఆశోక్‌ఖోస్లాతో పాటు పలువురు ప్రసిద్ధ ఖవ్వాల్‌లు పాడారు.

సాహితీ సేవకు వయస్సు అడ్డురాదు



సాహితీ సేవకు వయస్సు అడ్డంకి కారాదు. నాకు గుర్తింపునిచ్చిన భాష సేవకే జీవితాన్ని అంకితమిస్తున్నాను. ఊపిరి ఉన్నంతవరకు సాహితీ సేవలందిస్తాను. ఇప్పటివరకు వందలాది మంది శిష్యులను తీర్చిదిద్దాను.
-ఖమర్ అమీని, ప్రముఖ ఉర్దూ రచయిత

ఖమర్‌అమీని రచించిన ముఖ్య కవితల పుస్తకాలు

గుల్‌దస్తే, తవాఫే-గజల్, నాత్‌కీ అంజుమన్, కష్కోల్-ఏ-ఖల్బ్-ఓ-నజర్, ఇర్‌తెకాజ్-ఏ-అఫ్కార్,కష్కోల్-కరమ్

ఖమర్‌అమీనికి లభించిన బిరుదులు:

అనీస్-ఉస్-షోరా, నఖీబ్-ఉష్-షోరా

ప్రశంసలు: మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి ,మాజీ ప్రధానమంత్రి ఐ.కె.గుజ్రాల్, మాజీ గవర్నర్లు శివశంకర్, ఖుర్షీద్ అలంఖాన్, ప్రముఖ గేయరచయిత సీ నారాయణరెడ్డిలచే పలు ప్రశంసలు అందుకున్నారు.

సొంత ఇంటికి ఇకపై సర్వహక్కులు

- పండుగ వాతావరణంలో జగనన్న కాలనీల ఇళ్ల రిజిస్ట్రేషన్లు
- జిల్లాలో 2 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు



రాయచోటి సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన జగనన్న ఇళ్ల లబ్ధిదారులు

రాయచోటి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా పెద్ద కాలనీలు నిర్మించడమే కాకుండా నిర్మించుకున్న గృహాలపై లబ్ధిదారులకు సర్వహక్కులు కలిగేలా రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అన్నమయ్య జిల్లాలో నాలుగురోజులుగా సచివాలయ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు కలిసి లబ్ధిదారులకు వరుస క్రమంలో రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని చేపట్టారు. నాలుగు రోజుల్లో జిల్లాలో రెండు వేలకు పైగా రిజిస్ట్రేషన్లు చేసి లబ్ధిదారులకు సర్వహక్కులు కలిగేలా చేశారు. రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న వారి మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రజలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని సత్వరం అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్‌ను రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా చేసేలా జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

క్యూ కట్టిన లబ్ధిదారులు

రాయచోటిలో ఆదివారం సెలవు దినం అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లబ్ధిదారులు క్యూ కట్టారు. వందలాదిగా తరలిరావడంతో ఎల్లో పార్టీలు కన్నేశాయి. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రానున్న ఎన్నికల్లో భవిష్యత్తు ఉండదన్న ఆక్రోషంతో ప్రభుత్వం రిజిస్టర్‌ల పేరుతో ఇబ్బంది పెడుతోందని దుష్ప్రచానికి వడిగట్టారు. వీరికి ఎల్లో మీడియా కూడా తోడైంది. ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వంపట్ల వ్యతిరేకతను తెప్పిద్దామని ప్రయత్నం చేసిన వారికి లబ్ధిదారులు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చారు. జగనన్న మాకు ఇళ్లు ఇచ్చి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నారని చెప్పడంతో చేసేది లేక వారికి తోచిన రీతిలో సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. రాయచోటి పట్టణ పరిధిలోని నారాయణపల్లి వద్ద, అబ్బవరం, చెన్నముక్కపల్లి గ్రామాలలో 12 వేలకుపైగా లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. పట్టాలు పొందిన వారిలో చాలామంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. మరికొంత మంది వివిధ దశలలో నిర్మాణాలు చేస్తున్నామని చెబుతున్నారు. సచివాలయాలలో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నాలుగు రోజుల నుంచిజరుగుతోంది. ఉచితంగా రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చిన వారికి రాయచోటి సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి తగిన సౌకర్యాలను కల్పించారు. మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నిసార్లు ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారణంగా సొంతింట కల నేరవేరిందని, తిరిగి జగన్ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు.

జేసీ ఆరా....

జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా చేస్తున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆరా తీస్తున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ సచివాలయ, రెవెన్యూ, సబ్‌రిజిస్టర్ అధికారులను అప్రమత్తం చేస్తూ తగు సూచనలు ఇస్తున్నారు.

500కు పైగా రిజిస్ట్రేషన్లు

రాయచోటి సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలో ఆదివారం ఒక్కరోజే 500కుపైగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో నారాయణరెడ్డిగారిపల్లి, శిబ్యాల, అబ్బవరం తదితర ప్రాంతాలలోని జనగన్న లే అవుట్‌లో 12 వేలకుపైగా జగనన్న ఇంటి లబ్ధిదారులు రిజిస్ట్రేషన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని సచివాలయ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు పరిశీలించి క్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్‌లను చేస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


మృతి చెందిన తుపాకుల సుబ్రమణ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని కొర్లకుంట చెరువు సమీపంలో విద్యుత్ షాక్‌తో తుపాకుల సుబ్రమణ్యం (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రైల్వేకోడూరు మండలం, బొజ్జావారిపల్లి పంచాయతీ, బంగ్లామిట్ట గ్రామానికి చెందిన సుబ్రమణ్యం శుక్రవారం రాత్రి తన బావమరిది ఎం.శివతో కలిసి కొర్లకుంట చెరువు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. దారిలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు తీయడంతో తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గాయపడిన సుబ్రమణ్యంను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ఉంది. రైల్వేకోడూరు పరిసర ప్రాంతాలలో సుబ్రమణ్యం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

కన్న తల్లిని హతమార్చిన కూతురు


మృతి చెందిన యర్రక్క

వాల్మీకిపురం : కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తల్లిని హతమార్చిన సంఘటన వాల్మీకిపురం పట్టణం కొత్త ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకొంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. అనంతపురం జిల్లా కనేకల్లు మండలం హనకనహాళ్ నివాసి యర్రక్క (43) స్థానికంగా నివాసం ఉంటూ కూలిపనులు చేసుకునేది. కుటుంబ కలహాలతో ఆదివారం కూతురు నందిని, అల్లుడు శివరాంలు ఐరన్ రాడ్, కట్టెలతో కొట్టి యర్రక్కను హత్య చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ నాగేశ్వర రావు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణం చెల్లించలేదని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తాను ఇప్పించిన రుణం చెల్లించక పోవడంతో పాటు, తనపై దాడి చేయడంతో మనస్తాపం చెంది, వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె లో జరిగింది. పట్టణంలోని ఎగువ కురవంకకు చెందిన తిరుపాల్ నాయక్ భార్య తిరుపాలమ్మ (42), స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉంటోంది. అదే ప్రాంతంలో నివాసం ఉన్న స్వరూపారాణి పట్టణంలో హోటల్ నిర్వహిస్తోంది. దీంతో వ్యాపార అవసరాల కోసం తిరుపాలమ్మను నగదు రుణంగా కావాలని కోరింది. ఆమె సుమారు పది లక్షల రూపాయల వరకు స్వరూప రాణికి స్వయం సహాయక సంఘాల నుంచి రుణం తీసుకుని అప్పుగా ఇచ్చింది. అయితే స్వరూపా రాణి తీసుకున్న అప్పు సక్రమంగా చెల్లించకపోవడంతో, తిరుపాలమ్మ ఆమెను అప్పు చెల్లించాల్సిందిగా నిలదీసింది. స్వరూప రాణి అప్పు చెల్లించకపోగా దాడికి పాల్పడింది. దీంతో మనస్తాపం చెందిన తిరుపాలమ్మ ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం

- కీరసాగుపై పెరుగుతున్న ఆసక్తి
- మార్కెట్‌లో అధిక డిమాండ్
- రక్షిత వ్యవసాయం ద్వారా వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో సాగుచేస్తున్న విద్యార్థులు


షేడ్‌నెట్‌లో సాగు చేస్తున్న కీర


వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో సాగులో ఉన్న కీర

ఓబులవారిపల్లె : ప్రస్తుతం ఏ పంట సాగు చేయాలన్నా అధిక దిగుబడులు, నిర్వహణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. కూలీల కొరత కూడా అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి రైతులకు యూరోపియన్ కీర దోస సాగు చక్కటి ప్రత్యామ్నాయ పంట. తక్కువ ఖర్చుతో తక్కువ కాలంలో దిగుబడి సాధించడం ఈ పంట ప్రత్యేకత. వండకుండా తినే ఈ కూరగాయ పంటకు మార్కెట్లో డిమాండ్ ఉంది. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. అధిక పీచు పదార్థం కల్గి ఉండటంతో పాటు బీ, కే విటమిన్స్, ఖనిజ లవణాలను శరీరానికి అందిస్తుంది. జీర్ణ శక్తి మెరుగుపరుస్తుంది. ఈ పంటను అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రక్షిత వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి షేడ్ నెట్ కింద యూరోపియన్ కీర సాగు చేస్తున్నారు.

చదువులో భాగంగా..

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ఉద్యాన కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు చదువు సంపాదన, పని అనుభవ కార్యక్రమం కింద దీనిని సాగు చేస్తున్నారు. పంటలను స్వయంగా సాగు చేసి మెలకువలు నేర్చుకోవడం దీని ఉద్దేశం. 16 మంది విద్యార్థులు ప్రొటెక్టెడ్ కల్టివేషన్(రక్షిత వ్యవసాయ) పద్ధతులను ఎంచుకున్నారు. ఇందులో భాగంగా వారు షేడ్ నెట్, పాలీహౌస్‌లలో సాగు చేస్తున్నారు. వీరు మార్కెట్లో ఎంతో ఆదరణ ఉన్న కీర దోస సాగు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయంగా కీర సాగు అనుకూలం

రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు పేరు గాంచింది. రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి సాగు చేస్తున్న పంటలు కోత దశలో వాతావరణం, మార్కెట్ ధరలు, చీడపీడలు, తదితర వాటి వల్ల రైతులకు ప్రతి ఏడాది నష్టం వాటిల్లుతుంది. దోస, కర్బూజా పంటలు సాగు చేస్తున్న వాటికి వైరస్ ఎక్కువగా సోకుతుండడంతో మందుల ఖర్చులకే ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. రైతులకు కీర సాగు చేయడం ద్వారా ఖర్చు తక్కువతో పాటు మంచి ఫలితాలు సాధించవచ్చు.

సాగు పద్ధతి..

ఈ పంటకు మంచి నీటి పారుదల సౌకర్యంతో పాటు వెచ్చని వాతావరణం అవసరం. పంట సాగుకు 15 రోజుల ముందుగా నారును సిద్ధం చేసుకోవాలి. ఎకరానికి 1 నుంచి 1.4 కిలోల విత్తనాలు అవసరం. రెండు సాళ్ల మధ్య 1.5 నుంచి 2.5 మీటర్ల వరుసలో రెండు పాదుల మధ్య 0.5 నుంచి 0.75 మీటర్ల దూరం అవసరం. నారు వేశాక 7, 8 కణుపుల దగ్గర పార్శ్వ కొమ్మలను, పువ్వులు, టెండ్రిల్స్ తొలగించడం ముఖ్యం. అన్ని పార్శ్వ కొమ్మలను తీసివేయాలి. ఒకే కాండం ఉండేలా చూసుకోవాలి. పెరుగుతున్న మొక్కలకు గొడుగు పద్ధతి లేదా 'వీ' పద్ధతిలో ఊతమివ్వాలి. కాండాన్ని 6.5 నుంచి 7 అడుగులు పెరిగాక తలలను తుంచి వేస్తే రెండు రెమ్మలు వస్తాయి. వాటిని ఇరువైపులకు వేలాడ దీయాలి. ఈ పంటలో మంచి దిగుబడి కావాలంటే నీటి పారుదల, నిర్వహణ ఎంతో అవసరం. కీర దోస నాటిన 30 నుంచి 35 రోజుల తర్వాత కోత ప్రారంభమవుతుంది. ఉద్యాన విద్యార్థులు రెండు రకాల కీరదోస సాగు చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడి..

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన సీడ్‌లెస్ కీరదోస సాగు చేస్తున్నారు. 300 చదరపు మీటర్ల స్థలంలో సాగుకు 500 రూపాయలు విత్తనాలకు ఖర్చు అవుతుంది. ఈ పంట సాగు చేసిన 30 నుంచి 40 రోజుల తర్వాత 240 గ్రాముల బరువున్న కీరదోస కాయ దిగుబడిగా వస్తుంది. 7 రోజుల పాటు నిల్వ చేయవచ్చు. 10 సెంట్ల స్థలంలో సాగు చేస్తే 3 -5 టన్నుల దిగుబడి పొందవచ్చు. అలాగే పూసా పార్థినోకార్పిక్ దోస రకం పంట సాగు ద్వారా 40 నుంచి 45 రోజుల్లో పంట మొదటి కోతకు వస్తుంది. 150 గ్రాముల బరువున్న కీర దోస కాయలు వస్తాయి.

ఈ పద్ధతి మేలైనది



రక్షిత పద్ధతిలో సాగు చేసే యూరోపియన్ కీరదోసకి పరాగ సంపర్కంతో సంబంధం లేకుండా.. ప్రతి గెనుపుకి కాయ వస్తుంది. మామూలు పద్ధతితో పోల్చితే దిగుబడి రెట్టింపు వస్తుంది. డ్రిప్, ఫర్టిగేషన్ పద్ధతిలో విద్యార్థులకు మెలకువలు నేర్పుతున్నాము.

\- ప్రొఫెసర్ పి.శ్యాంసుందర్ రెడ్డి, కూరగాయల విభాగం

ఎంతో నేర్చుకున్నాం



కళాశాలలో క్షేత్ర అనుభవ కార్యక్రమం ఎంతో బాగుంది. ఎత్తులో మడులలో సాగు చేస్తున్నాం. డ్రిప్, ఫర్టిగేషన్ పద్ధతి అనుసరిస్తున్నాం. ఈ పంటసాగు ద్వారా అనేక మెలకువలు తెలిశాయి.

\- కె.తేజస్విని, విద్యార్థిని

నలుగురికి ఉపాధి కల్పిస్తా..



నేను కళాశాలలో ఐసీఏఆర్ కోటాలో అడ్మిషన్ పొందాను. ఇక్కడి పంటల సాగు ఆసక్తికరంగా ఉంది. ఇందులో షెడ్‌నెట్‌లో కీరదోస పంట సాగులో భాగమయ్యాను. ప్రతి రోజు పంట పెరుగుదల గమనిస్తూ అనేక విషయాలు నేర్చుకున్నాను. కోర్సు ముగిశాక సొంతంగా పంట సాగు చేస్తూ నలుగురికి ఉపాధి కల్పిస్తాను.

\- ఐరిన్ రోజ్, విద్యార్థిని

మార్కెట్లో డిమాండ్ ఉంది



రాబోయే వేసవిలో డిమాండ్ అధికంగా ఉంటుంది. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తే రెట్టింపు లాభాలు వస్తాయి. ఈ పంట సాగుద్వారా అనేక క్షేత్ర సమస్యలు తెలిసి వచ్చాయి.

\- పి.లోకేశ్వరరెడ్డి, విద్యార్థి

రక్షిత సాగు పద్ధతులు పాటిస్తా



కోర్సులో భాగంగా నేర్చుకున్న రక్షిత సాగు పద్ధతులను టమాట, క్యాప్సికమ్ పంటలలో అనుసరించవచ్చు. నేను కోర్సు అనంతరం ఈ పద్ధతులు పాటించడంతో పాటు రైతులకు శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాను.

\- జి.సాయితేజ, విద్యార్థి

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మా పిల్లలు ఇంటర్, డిగ్రీ, బి.టెక్ చదువుతున్నారు. గతంలో ఇన్‌కం, క్యాస్ట్ తదితర పత్రాలు పొందాలంటే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. వ్యయ ప్రయాసల కోర్చే వాళ్లం. ఈ ప్రభుత్వంలో వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి వారే దరఖాస్తు చేసి ఉచితంగా ఇంటికి క్యాస్ట్, ఇన్‌కం తదితర పత్రాలు తెచ్చి ఇచ్చారు. జగనన్నకు కృతజ్ఞతలు.

-రహమత్ అలీ, కమలాపురం

సొంతింటి కల సాకారం



నాకు వితంతు పింఛన్‌తోపాటు అమ్మఒడి అందుతోంది. మేము పూరి గుడిసెలో ఉండి గ్రామాల వెంబడి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నా చిరకాల స్వప్నమైన సొంతింటి నిర్మాణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని నెరవేరింది. ఎంతో ఆనందంగా ఉంది. దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా..

\- శెట్టి రమాదేవి, సింహాద్రిపురం

జగనన్న గోరు ముద్దతో పౌష్టికాహారం


జగనన్న గోరుముద్ద భోజనం తింటున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యత లేకుండా ఉండేది. అన్నం, పప్పు, వారానికి మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు అరటిపండ్లు అందించేవారు. టీడీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలో మొక్కుబడిగా మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేది. అయితే జగన్ సీఎం అయిన తర్వాత పేద విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. మెనూను పూర్తిగా మార్చివేసి పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇచ్చారు. జగనన్న గోరుముద్ద పేరుతో రోజుకు ఒక ప్రత్యేక వంటతో విద్యార్థులు ఇష్టంగా తినేలా మార్పులు చేశారు. విజిటబుల్ రైస్, లెమన్‌రైస్, పులిహోర, టమాటా బాత్, బెల్లంఅన్నం, వైట్‌రైస్, పప్పు, కర్రీ తదితర వాటితో పాటు వారానికి 5 రోజులు గుడ్లు, మూడు రోజులు చెక్కీలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నారు. ఇంటిలో కూడా ఇంత మంచి రుచికరమైన భోజనం దొరకదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొత్తుకు మీరిచ్చే విలువ ఇదేనా?

- టీడీపీ ఇన్‌చార్జిపై జనసేన నాయకుల ఆగ్రహం
- జయహో బీసీలో టీడీపీ భజనపై తిరుగుబాటు
- విలువలేని చోట ఉండలేమంటూ నిష్క్రమించిన జనసేన శ్రేణులు


జనసే నాయకుల నిరసనకు తల పట్టుకుంటున్న టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్

మదనపల్లె : టీడీపీ అధినేత చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు, కష్టకాలంలో ఎవరూ తోడులేకున్నా, తమ నాయకుడు పవన్‌కల్యాణ్ అండగా నిలవడమే కాకుండా కలిసి ఎన్నికల్లో పోటీచేద్దామని నిర్ణయం తీసుకుంటే.. స్థానిక టీడీపీ నాయకులు మాత్రం జనసేన పొత్తుకు ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరుగట్టువారిపల్లె టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గస్థాయి జయహో బీసీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. జనసేన నాయకులు రామాంజనేయులు తన అనుచరులతో కలిసి సమావేశానికి వచ్చారు. సమావేశంలో ఇద్దరు టీడీపీ నాయకుల ప్రసంగం తర్వాత మూడో వ్యక్తిగా రామాంజనేయులుకు అవకాశం ఇచ్చారు. ఆయన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకునేందుకు శ్రమిద్దామని పిలుపునిచ్చారు. తర్వాత వచ్చిన టీడీపీ నాయకులందరూ వారి పార్టీ భజన, ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్‌ను కీర్తించడమే పనిగా పెట్టుకున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేరు మాటవరుసకైనా ప్రస్తావించడం వదలిపెట్టి, కేవలం టీడీపీ ఎమ్మెల్యేనే గెలిపించుకుందామంటూ చెప్పుకోసాగారు. దీంతో ఆగ్రహించిన జనసేన నాయకులు పొత్తులో ఉన్నప్పుడు రెండుపార్టీల గురించి సమానంగా మాట్లాడి, ఎవరికి సీటు కేటాయించినా ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుందామని చెప్పాల్సింది పోయి.. టీడీపీకే సీటు వచ్చేసినట్లుగా ప్రచారం చేసుకోవడమేంటని నిలదీశారు. దీంతో అవాక్కయిన టీడీపీ నాయకులు జనసేన నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. విలువ లేనిచోట నిమిషమైనా ఉండలేమంటూ, జనసేన శ్రేణులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. టీడీపీ నేతలు తమ గొప్పలు చెప్పుకుని సమావేశం ముగించారు.

ముఖ్యమంత్రి నిర్ణయమే శిరోధార్యం

- మరోసారి రాజంపేట సెంటిమెంట్ నిలబెట్టాలి
- ఆకేపాటిని గెలిపించుకోవడానికి సిద్ధం కావాలి
- నేతల ఆత్మీయ సమావేశంలో మేడా సోదరుల పిలుపు


ఆకేపాటి గెలుపు కోసం సిద్ధం కావాలని పిలుపునిస్తున్న ఎమ్మెల్యే మేడా సోదరులు

రాజంపేట : రాజంపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయమే శిరోధార్యమని మేడా సోదరులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి వెల్లడించారు. మేడా భవన్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డితో కలిసి నందలూరు మండల వైఎస్సార్‌సీపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేటలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడో అదే పార్టీ అధికారంలోకి వస్తుందన్నది దశాబ్దాలకాలం నుంచి వస్తున్న సెంటిమెంట్ అన్నారు. తిరిగి ఇదే సెంటిమెంట్‌ను వైఎస్సార్‌సీపీ దక్కించుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేడా మల్లికార్జునరెడ్డికి టికెట్ ఇచ్చారన్నారు. అప్పుడు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తమ గెలుపునకు కృషి చేశారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి ఆకేపాటిని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రిను తాము కలిసినప్పుడు అమరన్న అభ్యర్థిగా పోటీ చేస్తారని, ఆయనకు మీరు సహకరించాలని సీఎం ఆదేశించారన్నారు. అదే విధంగా తాము ముందుకెళుతున్నామన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు కలిసికట్టుగా ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏవో చిన్న భేదాభిప్రాయాలు, చిన్న చిన్న సమస్యలు ఉంటాయని అవి కుటుంబంలో సహజమని, వాటన్నింటి కలిసి కూర్చుని పరిష్కరించుకుంటామన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు మేడా రఘునాథరెడ్డితో పాటు అందరి నేతలను సమన్వయం చేసుకొని ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకొని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. అనంతరం నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, నాయకులు నడివీధి సుధాకర్, ఆకేపాటి జగ్గి, గంపా సుధాకర్, రాజశేఖర్‌రెడ్డి, హస్తవరం సుబ్బరామిరెడ్డి, గీతాల నరసింహారెడ్డి, హాల్‌మస్తాన్, నాగసుబ్బయ్య, విశ్వనాథ్, సోమిశెట్టి ప్రభాకర్, అరిగెల నాని, కాకి చంద్ర, మైనార్టీ నేతలు మున్వర్‌బాషా, కో–ఆప్షన్ సభ్యుడు కలీం, బీసీ నేత హిమగిరి యాదవ్‌తోపాటు వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ చేసిన వ్యక్తిపై చర్య తీసుకోండి


వంకపోరంబోకు భూమిని ఆక్రమించుకొని గేటు కట్టారని చూపుతున్న రైతులు

రాజంపేట టౌన్ : రాజంపేట మండలం ఊటుకూరులోని 552 సర్వే నంబర్‌లో ఉన్న వంకపోరంబోకు భూమిని చేజెర్ల వాసుదేవరాజు కొంత మేర ఆక్రమించుకోవడంతో తాము పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డును నిర్మించుకోలేక పోతున్నట్లు ఆ ప్రాంతానికి చెందిన నాగేశ్వరరాజు, కోడూరు వెంకటరామయ్య, శివారెడ్డి, మాధవరాజు, సుబ్రమణ్యం అనే రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన భూమి వద్ద రైతులు ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఈ సర్వే నంబర్‌లోని భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి వాసుదేవరాజు వంకపోరంబోకు భూమిని ఆక్రమించుకున్నట్లు గుర్తించి సర్వేరాళ్లు కూడా నాటారన్నారు. అయినప్పటికి వాసుదేవరాజు వంకపోరంబోకు స్థలంలోనే గేటు నిర్మించాడన్నారు. దీంతో తాము పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు వేసుకునేందుకు కూడా వీలులేకుండా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేసి, రోడ్డు వేసుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

తప్పుడు రాతలు తగవు

రాజంపేట మండలం ఊటుకూరులోని 1497 సర్వే నెంబర్‌లో ఉన్న నీటిపారుదలశాఖ కాలువను వైఎస్సార్ సీపీ నాయకులు పూడ్చివేసి రోడ్డు వేస్తున్నట్లు పచ్చపత్రిక అసత్య వార్తలు రాయడం తగదని ఆ ప్రాంత రైతులు ఖండించారు. వాసుదేవరాజు ఈ సర్వే నంబర్‌లో 43 సెంట్ల గయాళిపోరంబోకు భూమిని అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నాడని వారు ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులపై బురదజల్లేలా తప్పుడు వార్తలు రాస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని చీకలబైలు వద్ద ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా, వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల టీచర్స్ కాలనీకి చెందిన అనిల్ కుమార్, రూ.1440 విలువ గల ఎనిమిది కర్ణాటక బీర్లు అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం బొమ్మనహళ్లికి చెందిన బైరే గౌడ కుమారుడు ప్రదీప్ కుమార్ వద్ద నుంచి 840 రూపాయలు విలువగల 8 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కాంగ్రెస్ వర్సెస్ టీడీపీ ఫ్లెక్సీవార్

- బెంగళూరు బస్టాండ్ కాంగ్రెస్ అడ్డా అన్న రెడ్డిసాహెబ్
- మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాదే అన్న టీడీపీ నాయకులు


కాంగ్రెస్‌పార్టీ ఫ్లెక్సీలను తొలగిస్తున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరుడు

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని బెంగళూరు బస్టాండులో ఆదివారం కాంగ్రెస్ వర్సెస్ టీడీపీ ఫ్లెక్సీవార్ జరిగింది. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరులు షంషీర్, షోయబ్‌శీను, సైదులు కాలితో తన్నుతూ, ఆగ్రహంగా పెరికి పారేయడంతో వివాదం మొదలైంది. ఈ సందర్భంగా ఇరుపార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది. వివరాలు.. బెంగళూరు బస్టాండ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. రెండురోజుల క్రితం టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పుట్టినరోజు సందర్భంగా ఆయన అనుచరులు శుభాకాంక్షలు తెలుపుతూ, కాంగ్రెస్‌పార్టీ వారు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీల ముందువైపున ఏర్పాటుచేశారు. అయితే...రోజులు గడుస్తున్నా వారు ఫ్లెక్సీని తొలగించకపోవడంతో.. కాంగ్రెస్ నాయకులు టీడీపీ ఫ్లెక్సీలను తీసేశారు. దీన్ని అవమానంగా భావించిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరులు ఫ్లెక్సీలు తొలగించిన కాంగ్రెస్ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ కాంగ్రెస్ ఇన్‌చార్జి రెడ్డిసాహెబ్ అక్కడకు చేరుకుని, టీడీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. బెంగళూరు బస్టాండ్ ఇందిరాసర్కిల్ కాంగ్రెస్‌పార్టీకి అడ్డా అని, ఇక్కడ ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే... ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ, షర్మిల తదితర నాయకుల ఫొటోలతో ఏర్పాటు చేయాలని, లేకుంటే ఎవరివైనా సరే నిర్దాక్షిణ్యంగా తొలగించేస్తామన్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరులు, బెంగళూరు బస్టాండ్ తమ నాయకుడి అడ్డా అని, ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది, సర్కిల్‌గా తీర్చిదిద్దింది తామేనంటూ, పూర్తి హక్కులు తమకే ఉన్నాయంటూ ఎదిరించి మాట్లాడారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరుగుతుండగా, సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ వలీబాషు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇరుపార్టీల నాయకులను పిలిపించి, ప్రశాంతంగా ఉన్న పట్టణంలో చిల్లర గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, సర్దుకుపోకుంటే.. అందరిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరులు అక్కడి నుంచి వెళ్లిపోగా, కాంగ్రెస్ నాయకులు తమ ఫ్లెక్సీలను యథాస్థానంలో ఏర్పాటు చేసుకున్నారు.

కాంపౌండ్ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె : కొనుగోలు చేసిన భూమిలో నిర్మించుకున్న కాంపౌండ్ వాల్‌ను సంబంధం లేని వ్యక్తులు దౌర్జన్యంగా కూల్చివేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని వీవర్స్‌కాలనీకి చెందిన నాగిరెడ్డి ఎస్‌బీఐ కాలనీ సర్వే నంబర్.400/1లో 50 సెంట్లు, 402లో 30 సెంట్లు మొత్తం 80 సెంట్లు భూమిని కప్పల వెంకటప్ప ఏకైక కుమార్తె రెడ్డెమ్మ వద్ద కొనుగోలు చేశానన్నారు. కొనుగోలు చేసిన భూమిని సర్వేయర్ సహాయంతో హద్దులు చూపించుకుని, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసినట్లు చెప్పారు. ఇదిలాఉంటే.. ఈ స్థలానికి ఏమాత్రం సంబంధం లేని కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించి, కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేశారన్నారు. గతంలో ఓ సారి ఇదే స్థలానికి సంబంధించి డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు సర్వే చేయించి, స్వాధీనం చేసుకోవాలని చెప్పిన మేరకు నడుచుకున్నామన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం జరిగేటప్పుడు అభ్యంతరం తెలపని వ్యక్తులు నిర్మాణం పూర్తయిన తర్వాత కూల్చేయడం తగదన్నారు.